క్లుప్తంగా

వృథాగా తాగునీరు



గోట్లపల్లిలో లీకవుతున్న పైపు

పెద్దేముల్: పైపులైన్ పగిలి తాగునీరు వృథాగా పోతున్న ఎవరూ పట్టిం చుకోవడం లేదని మండలం పరిధిలోని గోట్లపల్లి ప్రజలు వాపోతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. బోరు పైపులైన్ పగిలి సుమారు 20 రోజులు దాటినా పంచాయతీ అధికారులకు కనబడటం లేదాని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

బీటీరోడ్డు పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

దౌల్తాబాద్: మండలంలోని బిచ్చాల గేటు నుంచి అంతారం గ్రామం వరకు మంజూరైన బీటీ రోడ్డు పనులను బుధవారం స్థానిక నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు రూ.10కోట్ల వ్యయంతో రోడ్డు పనులు నిర్మిస్తున్నారు. సీఎం నియోజకవర్గం కావడంతో పనులను త్వరితగతిన పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు. రోడ్డు పనులు పూర్తయితే బిచ్చాల, అంతారం, గుండేపల్లి, బాలంపేట తదితర గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగవుతుందని పేర్కొన్నారు.

బస్టాండు జలమయం



జలమయమైన ధారూరు బస్టాండు

ధారూరు: వరుస వర్షాలకు ధారూరు ఆర్టీసీ బస్టాండు జలమయంగా మారింది. బస్టాండు ఆవరణలోకి పైనుంచి వరదనీరు చేరడంతో బస్సులన్నీ రోడ్డుపైనే ఆగి వెళ్తున్నాయి. బస్సులను లోపలికి తీసుకెళ్లడానికి డ్రైవర్లు బయపడుతున్నారు. లోతట్టు ప్రాంతంలో ఉన్న బస్టాండు వల్ల వానాకాలంలో ప్రయాణికులకు ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతుందని ప్రయాణికులు వాపోతున్నారు.

ఉధృతంగా కాగ్నా



డైవర్షన్ రోడ్డు సీసీ పైపుల ద్వారా ప్రవహిస్తున్న నీరు

ధారూరు: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాగ్నానది ఉధృతంగా ప్రవహిస్తోంది. స్టేషన్‌ధారూరు- దోర్నాల్ గ్రామాల మధ్య కాగ్నానదిపై వంతెన పనులు సాగుతున్నాయి. నీటి ప్రవాహం ఎక్కువగా ఉండటంతో పనులు ఆగాయి. వరుస వర్షాలకు సర్పన్‌పల్లి, లక్నాపూర్ ప్రాజెక్టులు నిండి అలుగులు పారుతున్నాయి. నీటి ప్రవాహాన్ని అంచనా వేసేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు పోలీసుల నిఘా ఏర్పాటు చేశారు. ఉధృతి ఎక్కువైతే ధారూరు-తాండూరు వయా దోర్నాల్, రాస్నం గ్రామాలకు, ధారూరు-పరిగి, ధారూరు-కొడంగల్ ప్రాంతాలకు రాకపోకలు పూర్తిగా స్తంభిస్తాయి. కావునా అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా రోడ్లు, భవనాలశాఖ డైవర్షన్ రోడ్డులో కొట్టుకపోయినా సీసీ పైపులను సరిచేసి పైన మట్టి వేయించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చేశారు.

పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్



చెక్కులను అందిస్తున్న శంకర్ తదితరులు

మోమిన్‌పేట: పేదలకు సీఎం సహాయనిధి వరమని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శంకర్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయా గ్రామాలకు చెందిన 12మంది లబ్ధిదారులకు రూ.4.51లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్పొరేట్ ఆస్పత్రిలో మెరుగైన చికిత్స కోసం సీఎం సహాయనిధి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు నరోత్తంరెడ్డి, సురేందర్, మాణయ్య, హెరాజ్, బాల్‌రెడ్డి, రవి, పోచయ్య, విఠల్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

అమ్మమాట.. అంగన్‌వాడీ బాట



ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

- చిన్నారుల సంఖ్యను పెంచేలా కార్యక్రమం
- ఈ నెల 20వరకు నిర్వహించేలా కార్యాచరణ

దౌల్తాబాద్: చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య ఎంతో కీలకం. నూతన విద్యావిధానంలో భాగంగా పాఠశాలల్లో చేరే నాటికి అక్షరాలు, అంకెలు నేర్పి ఆటాపాటలతో కూడిన విద్యను అందించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రెండున్నరేళ్లు దాటిన చిన్నారులను గుర్తించి అంగన్‌వాడీల్లో చేర్పించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఈ నెల 15 నుంచి వారం రోజుల పాటు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అమ్మ మాట... అంగన్‌వాడీ బాట పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. చివరి రోజు ఈనెల 20న సామూహిక అక్షరాభ్యాసం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం ద్వారానే అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన చిన్నారులకు యూనిఫాం అందించేందుకు ఏర్పాట్లు చేస్తుంది.

పూర్వ విద్య అందించడమే లక్ష్యం

ప్రభుత్వ ఆదేశాల మేరకు వారం రోజులు పాటు నిర్వహించే అమ్మ మాట- అంగన్‌వాడీ బాట కార్యక్రమం సోమవారం నుంచే ప్రారంభించాం. చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు అలవాటు చేసి ఆటపాటలతో పూర్వ విద్య అందించడమే లక్ష్యం. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలి.

– మంజుల సూపర్‌వైజర్, దౌల్తాబాద్

మండలంలో 68 కేంద్రాలు

మండలంలో 33 గ్రామపంచాయతీల్లో రెండు సెక్టార్లల్లో 68 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఆయా కేంద్రాల పరిధిలో ప్రస్తుతం గర్భిణులు 263 మంది, బాలింతలు 158 మంది ఉన్నారు. 6నెలలోపు చిన్నారులు 1426 మంది, 3నుంచి 6ఏళ్ల లోపు పిల్లలు 1039 మంది ఉన్నారు.

ప్రత్యేక యూనిఫాం..

అంగన్‌వాడీ చిన్నారులకు ఈ విద్యాసంవత్సరం నుంచి యూనిఫాం అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. మొదటిదశలో ప్రాథమిక పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న కేంద్రాల్లోని చిన్నారులకు యూనిఫాం పంపిణీ చేయనున్నారు.

మానసిక ఒత్తిడికి లోనుకాకుండా..

ప్రైవేట్ పాఠశాలల్లోని నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యకు దీటుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రీస్కూల్ విద్యను అందిస్తున్నారు. పిల్లలు మానసిక ఒత్తిడికి లోనుకాకుండా నిపుణుల సూచన మేరకు ఆటలు, పాటలు కథల ద్వారా చిన్నారులకు చదువుపై ఆసక్తిని పెంపొందిస్తున్నారు. చిన్నారులను ఆకట్టుకునే విధంగా సిలబస్ రూపొందించారు.

బహుజనులకు అండగా కాంగ్రెస్

కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నీలం మధుముదిరాజ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మధుముదిరాజ్

కుల్కచర్ల: బీసీ, బహుజనులందరూ పార్టీలకతీతంగా ఐక్యంగా ఉన్నప్పుడే బడుగుబలహీన వర్గాల ప్రజలకు రాజ్యాధికారం సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు నీలంమధు ముదిరాజ్ అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ బహుజనులకు మేలు చేసేలా నిర్ణయాలు తీసుకోవడంతో పాటుగా సంక్షేమ పథకాలు అందరికీ అందేలా ప్రణాళికాయుతంగా ముందుకు సాగుతుందన్నారు. బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి సీఎం రేవంత్‌రెడ్డి అన్ని విధాల సహకారం అందిస్తున్నారని అన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో అత్యధిక సంఖ్యలో బహుజన నాయకులు ప్రజాప్రతినిధులుగా ఎన్నికయ్యాలా కృషి చేయాలని కోరారు. రాజకీయంగా ఎదిగే బీసీ నాయకులకు తమ మద్దతు ఉంటుందన్నారు. పేదలకు కుమ్మరిస్వామి అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కుమ్మరి స్వామి, కుల్కచర్ల ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు చంద్రలింగం, చౌడాపూర్ మండల సంఘం అధ్యక్షుడు కృష్ణ, మాజీ ఎంపీటీసీ ఆనందం, రవి, శ్రీను, రమేష్, సత్యయ్య, బాబు, మురళి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం తగదు



బాధితురాలితో మాట్లాడుతున్న చంద్రప్రకాష్

కుల్కచర్ల: పారిశుద్ధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాష్ పేర్కొన్నారు. మండలంలోని పుట్టపహాడ్‌కు చెందిన గీతాంజలి డెంగీవ్యాధికి గురైంది. బుధవారం మండల వైద్యాధికారుల బృందం గ్రామానికి వెళ్లి బాధిత యువతి గీతాంజలితో మాట్లాడి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. ఏదైనా ఇబ్బందిగా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య అధికారులు వెంకన్న, మనీష్ పాల్గొన్నారు. అయితే, అంతారం గ్రామానికి చెందిన ఓ బాలుడికి డెంగీ వచ్చినట్లుగా తెలుస్తోంది. అధికారికంగా నిర్ధారించాల్సి ఉంది.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఎస్సై స్రవంతి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై స్రవంతి

బంట్వారం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోట్‌పల్లి ఎస్సై స్రవంతి సూచించారు. జిల్లా పోలీసు కళాబృందం వారు మంగళవారం రాత్రి కోట్‌పల్లి మండలంలోని అన్నాసాగర్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్రవంతి మాట్లాడుతూ.. రోడ్డు భద్రత, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, బ్యాంకింగ్ ఆన్‌లైన్ మోసాలపై ఆమె ప్రజలకు వివరించారు. మహిళలపై జరుగుతున్న నేరాలు డయల్ 100, షీటీం, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా తదితర అంశాలపై క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. కొత్త వ్యక్తులు ఎవరైనా గ్రామాల్లో అనుమానితులుగా తిరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో కళాజాత బృందం సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉగ్రవాదాన్ని అంతమొందించాలి



వీర జవాన్లకు నివాళులర్పిస్తున్న గురునాథ్‌రెడ్డి, నేతలు

సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి

దోమ: దేశంలో ఉగ్రవాదాన్ని అంతమొందించాలని సర్పంచుల సంఘం మండల మాజీ అధ్యక్షుడు రాజిరెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జమ్ముకాశ్మీర్, పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతాల్లో అమరులైన వీర జవాన్లకు శ్రద్ధాంజలి ఘటిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉగ్రవాదుల దాడిలో వీర జవానులు అమరులు కావడం బాధాకరమన్నారు. దేశంలో ఉగ్రదాడులు పెరుగుతున్నాయని, కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టితో ఉగ్రవాదాన్ని అంతమొందించేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అమరులైన వీర జవానుల కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు . కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మయ్య ముదిరాజ్, మాజీ వైస్ ఎంపీపీ బంగ్లయాదయ్య గౌడ్, సీనియర్ నాయకులు రాఘవేందర్‌రెడ్డి, బంగ్ల వెంకటయ్యగౌడ్, ఆర్మీ రిటైర్డ్ అధికారి గురునాథ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బహుజనవాది పండుగల సాయన్న

మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్



పరిగి: సాయన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పరిగి: పండుగల సాయన్న గొప్ప బహుజనవాది అని, ఆయన బహుజనుల కోసం చేసిన సేవలు మరవలేనివని మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్ కుమార్ అన్నారు. బుధవారం ఆయన జయంతి సందర్భంగా పట్టణ కేంద్రంలోని విగ్రహానికి ప్రజా సంఘాలు, పలు పార్టీల నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సాయన్న 19వ శతాబ్దంలో బడుగు బలహీన వర్గాలకు జరుగుతున్న అన్యాయంపై పోరాటం చేసిన వ్యక్తి అని అన్నారు. ఉన్న వారి నుంచి దోచుకుని లేని వారికి పండుగల రూపంలో ఊర్ల ఊర్లకు దానం చేశారన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన అతడి జీవిత చరిత్రను కొంత మంది దాచి పెట్టారని, కాని బుర్రకథల ద్వారా నేటి సమాజానికి తెలిసిందన్నారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు హన్మంతుముదిరాజ్ మండల విద్యాధికారి హరిశ్చందర్, రామస్వామి, ముకుందనాగేశ్వర్, శేకర్, శ్రీశైలం పాల్గొన్నారు.

కుల్కచర్లలో..

మండలంలోని ఆయా గ్రామాల్లో ముదిరాజ్ సంఘాల ఆధ్వర్యంలో పండగ సాయన్న జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం కుల్కచర్ల మండల అధ్యక్షుడు చంద్రలింగం, చౌడాపూర్ మండల అధ్యక్షుడు కృష్ణ మాట్లాడుతూ... ముదిరాజ్‌లు సంఘటితమై తమ హక్కుల కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు పండగ సాయన్నను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంజిలయ్య, మైపాల్, శ్రీనివాస్, ఆనందం, రమేష్, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

గౌతపూర్‌లో

తాండూరు రూరల్: నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాటం చేసిన యోధుడు పండుగ సాయన్న జయంతిని బుధవారం మండల పరిధిలోని గౌతపూర్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు.



దోమ: నివాళులర్పిస్తున్న మాజీ జెడ్పీటీసీ లక్ష్మయ్య, తదితరులు

ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గోపాల్ ముదిరాజ్,రాజు ముదిరాజ్, బాలప్ప, జైపాల్, సురేష్, నర్సిములు, జయప్ప, సాయిప్రసాద్, పవన్, సునీల్, సంజీవ్, నర్సింలు, నరేష్, వెంకటేష్‌లు ఉన్నారు.

అధికారికంగా నిర్వహించాలి

తాండూరు టౌన్ : దొరల పెత్తనాన్ని ఎదిరించి పోరాడిన యోధుడు పండుగ సాయన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని బీఎస్పీ అసెంబ్లీ ఇన్‌చార్జి సత్యమూర్తి డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని బహుజన సమాజ్ పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశ్‌ముఖ్‌లు, దొరలు, నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ ముద్దుబిడ్డ సాయన్న అని కొనియాడారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు బాలరాజు ముదిరాజ్, క్రాంతి ముదిరాజ్, కృష్ణయ్య గౌడ్, ప్రవీణ్, బాబు పాల్గొన్నారు.

దోమలో..

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పండగ సాయన్న కృషి అమోఘమని మాజీ జెడ్పీటీసీ లక్ష్మయ్య ముదిరాజ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయా గ్రామాల ముదిరాజ్ సంఘం నేతలతో కలసి పండగ సాయన్న 133వ జయంతి వేడుకల సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పండగ సాయన్న అత్యంత ధీరుడిగా, సాహసవంతుడిగా చిన్ననాటి నుంచి అన్యాయాలను ఎదిరించి, పేదల పక్షాన నిలబడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు నర్సింహులు, ప్రధాన కార్యదర్శి చందు, సంయుక్తకార్యదర్శి సంజీవ్‌కుమార్, ఆయా గ్రామాల ముదిరాజ్ సంఘం నేతలు చంద్రశేఖర్, రాము, యాదయ్య, గోవర్ధన్, అనంతయ్య, గణేశ్, నరేశ్, శ్రీనివాస్, నవీన్, ఆనంతయ్య, ఆంజనేయులు, జనార్దన్, తదితరులు పాల్గొన్నారు.



బషీరాబాద్: పాదయాత్రగా వెళ్తున్న భక్తులు



అనంతగిరి: అమ్మవారి సన్నిధిలో స్పీకర్

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు


బషీరాబాద్: ఆషాఢ తొలి ఏకాదశి సందర్భంగా బషీరాబాద్ మండలంలో భక్తులు వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రం బషీరాబాద్ నుంచి సరిహద్దు కర్ణాటకలోని హల్కోడ స్వయంభు శ్రీవిఠలేశ్వర రుక్మిణి ఆలయం వరకు భక్తులు భజన చేస్తూ పాదయాత్రగా వెళ్లారు. అక్కడ పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

అమ్మవారి సేవలో స్పీకర్

అనంతగిరి: ఆషాఢ మాస ఏకాదశిని పురస్కరించుకుని బుధవారం అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్ వికారాబాద్ పట్టణం శివారెడ్డిపేట ప్రధాన రోడ్డు వద్ద కొలువైన భవాని మాత అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు అర్చన చేసి ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

పాండురంగస్వామి దేవాలయాల్లో..

తాండూరు: పట్టణంలోని పాండురంగస్వామి దేవాలయాల్లో భక్తిశ్రద్ధలతో తొలి ఏకాదశి పూజలు జరిగాయి. చాతుర్మాసం ప్రారంభం రోజు కావడంతో భక్తులు పాండురంగ స్వామిని దర్శించుకున్నారు. పట్టణంలోని మల్‌రెడ్డిపల్లి పాండురంగస్వామి దేవాలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం స్వామివారికి పల్లకీ సేవ, ఉయ్యాల సేవ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాలకు స్థానిక ప్రజాప్రతినిధులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.



తాండూరు: భక్తులకు దర్శనమిచ్చిన స్వామి

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి



మృత్యువాత పడిన ఎద్దు

బంట్వారం: విద్యుత్‌షాక్‌తో ఎద్దు మృతి చెందిన ఘటన బుధవారం బంట్వారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పాలెపల్లి నజీర్ పాషా అనే రైతు ఎద్దును మేత కోసం పొలానికి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను తాకడంతో ఎద్దు అక్కడికక్కడే మృతి చెందింది. దీని విలువ రూ.75వేల ఉంటుందని, తనను ఆదుకోవాలని బాధిత రైతు కోరాడు.

అనుమతిలేని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు

ఎంఈఓ రాంరెడ్డి

కొడంగల్: ప్రభుత్వ అనుమతి లేని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోనున్నట్లు ఎంఈఓ రాంరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ప్రైవేటు పాఠశాలలకు నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. తగు పత్రాలు ఇవ్వని కారణంగా ఆ పాఠశాలలకు తిరిగి షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు సీజ్ చేస్తామన్నారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నియమాలు పాటించాలన్నారు. ఉల్లంఘించిన పాఠశాలలపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉచిత కంటి ఆపరేషన్లు



కంటి పరీక్షలు చేస్తున్న లయన్ హరినాథ్ నెహ్రూ

కొడంగల్: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ, లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో లయన్ హరినాథ్ నెహ్రూ పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. 35 మందికి కంటి పరీక్షలు చేయగా అందులో 20 మందిని ఆపరేషన్ల కోసం ఎంపిక చేశారు. వీరిని మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని రాంరెడ్డి కంటి వైద్యశాలలో ఆపరేషన్లు చేయడానికి ప్రత్యేక వాహనంలో పంపించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మురహరి వశిష్ట మాట్లాడుతూ.. కంటి చూపు సరిగ్గా ఉంటేనే అన్ని పనులు చేసుకోడానికి అనుకూలంగా ఉంటుందన్నారు. సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి నెలకు ఒకసారి ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా లయన్ హరినాథ్ నెహ్రూను సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు జయతీర్థాచారి, శ్రీనివాస్‌గౌడ్, మునీర్, భీంరాజు పాల్గొన్నారు.

సంక్షేమానికి పెద్దపీట

అనంతగిరి: ప్రభుత్వం సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సుధాకర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్‌కు చెందిన పలువురు బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తుందన్నారు. ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందని తెలిపారు. రుణమాఫీ చేసి రైతుల ఇంటా పండుగ వాతావరణం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌ముదిరాజ్ పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న సుధాకర్‌రెడ్డి